

నైపుణ్యాల వైపు దృష్టి..

అధ్యాపకులు అధ్యయనం, నైపుణ్యాల వైపు దృష్టి సారించాలని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. - 10లో



రైతు సంక్షేమమే లక్ష్యం

రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం / కనిష్టం
35° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



కోదాడరూరల్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

కోదాడరూరల్ : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారం కోదాడ డీఎస్పీ కార్యాలయంతో పాటు పట్టణ, రూరల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలు రాష్ట్రంలోకి రాకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నిఘా పెంచాలని సూచించారు. గంజాయితో పట్టుబడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పట్టణ, రూరల్, మునగాల సీఐలు రాము, రజితారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ అనిల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మొక్కల పరిరక్షణ అధికారుల బాధ్యత



బీబీగూడెం గ్రామంలో సంపద వనాలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

చివ్వెంల(సూర్యాపేట) : హరితహారం మొక్కల పరిరక్షణ అధికారులు బాధ్యత అని జెడ్పీ సీఈఓ అప్పారావు అన్నారు. మంగళవారం చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులో ఎస్సారెస్పీ కాలువ వెంట ఉన్న సంపద వనాలను పరిశీలించి మాట్లాడారు. నాటిన మొక్కలను సంరక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఏపీఓ నాగయ్య, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

4న రాష్ట్ర సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఖమ్మం పట్టణంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య తెలిపారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని చంద్రాపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీ ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సింహాద్రి, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు సామ నర్సిరెడ్డి, బొల్లె వెంకన్న, ఎర్ర ఉమేష్, బండి రవి, ప్రవీణ్, భీమ్‌రెడ్డి, శ్రీధర్, మహేష్ పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

హుజూర్‌నగర్: పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టం చేయాలని కోరుతూ మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50శాతం కలిపి మద్దతు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.బ్రహ్మం, పి.వీరబాబు, ఆర్.మురళి, వి.వెంకటరెడ్డి, పి.వెంకటనారాయణ, వి.సైదులు, హుస్సేన్, యోన, వెంకటేశ్వర్లు, వీరయ్య, వీరస్వామి, సాంబయ్య, వేణు, శ్రీను, వెంకన్న, సైదులు, భిక్షం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మరింత చేరువ.. మీ సేవ

కొత్తగా 48 మీసేవ కేంద్రాలు మంజూరు

- మహిళాశక్తి పథకంలో భాగంగా ఏర్పాటుకు ప్రణాళిక
- స్వయం సహాయ సంఘాల సభ్యులకే నిర్వహణ బాధ్యత
- లబ్ధిదారుల ఎంపికకు డీఆర్‌డీఏ అధికారుల కసరత్తు



మండలాలు 23	గ్రామ పంచాయతీలు 475
ప్రస్తుతం కొనసాగుతున్న మీసేవ కేంద్రాలు 84	కొత్తగా మంజూరైనవి 48
ఒక్కో సెంటర్ ఏర్పాటుకు ఇవ్వనున్న రుణం రూ.2.50 లక్షలు	

భానుపురి (సూర్యాపేట) : జిల్లాకు మరిన్ని మీసేవ కేంద్రాలు రాబోతున్నాయి. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామగ్రామాన వీటిని ఏర్పాటు చేస్తోంది. మహిళా శక్తి పథకంలో భాగంగా నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాకు ప్రస్తుతం 48 మీసేవ కేంద్రాలు మంజూరుకాగా.. నిర్వహణ బాధ్యతలను మహిళలకే అప్పగించనున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో నుంచి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సంఘాల మహిళలకు అవగాహన

జిల్లాలో ఏఏ మండలాలు, ఏఏ గ్రామాల్లో మీసేవ కేంద్రాలు అవసరమున్నాయో రాష్ట్ర ప్రభుత్వం వివరాలు సేకరించి నేరుగా జాబితాను విడుదల చేసింది. ఈ సెంటర్లను మహిళలే నడిపించాల్సి ఉండడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు రంగంలోకి దిగారు. స్వయం సహాయక సభ్యుల ఎంపిక కోసం మీసేవ కేంద్రాలు మంజూరైన గ్రామాల జాబితాతో కసరత్తు ప్రారంభించి అవగాహన కల్పిస్తున్నారు. నెలవారీ పొదుపుల ప్రగతి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాల రికవరీ తీరును పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఆ రుణాలను సక్రమంగా చెల్లించి ఏ- గ్రేడ్‌లో ఉన్న సంఘాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొదటగా మీసేవ కేంద్రం ఏర్పాటుపై ప్రాథమికంగా అవగాహన కల్పిస్తున్నారు. మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు వివరిస్తున్నారు. ఇంటర్, ఆపై ఎక్కువ చదువుకున్న మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మీసేవ కేంద్రాలు మంజూరైన గ్రామాల్లో ఒకటే దరఖాస్తు కాకుండా పోటీ నెలకొంటే ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది.

జిల్లాకు 48 సెంటర్లు మంజూరు

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల పరిధిలో ఇప్పటికే 84 మీసేవ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అయితే కొత్తగా 48 మీసేవ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అత్యధికంగా మఠంపల్లి మండలంలో బీల్యాతండా, చౌటపల్లి, మట్టపల్లి, పెదవీడు, వర్ధపురం గ్రామాల్లో ఐదు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇక ఆత్మకూర్ (ఎస్) మండలంలో కందగట్ల, కోటపహాడ్, పాతర్లపహాడ్, హుజూర్‌నగర్ మండలంలో అమరవరం, బూరుగడ్డ, లింగగిరి, గరిడేపల్లి మండలంలో కల్మల్‌చెర్వు, రాయినిగూడెం, సర్వారం, కోదాడ మండలంలో గణపవరం, కాపుగల్లు, కూచిపూడి, పాలకవీడు మండలంలో గుండ్లపహాడ్, గుడుగుంట్లపాలెం, జాన్‌పహాడ్, పెన్‌పహాడ్ మండలంలో అనంతారం, జి.మల్కాపురం, పెన్‌పహాడ్, తిరుమలగిరి మండలంలో జలాల్‌పురం, తొండ, వెలిశాల, తుంగతుర్తి మండలంలో అన్నారం, వెలుగుపల్లి, వెంపటి గ్రామాల్లో మూడు చొప్పున నెలకొల్పనున్నారు. అనంతగిరి మండలంలో గొండ్రియాల, చిలుకూరు మండలం నారాయణపురం, చింతలపాలెం మండలం కిష్టాపురం, చివ్వెంల మండలం చందుపట్ల, జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం, మద్దిరాల మండలం గోరెంట్ల, మేళ్లచెర్వు మండలం కందిబండ, రేవూరు, మోతె మండలం సిరికొండ, మునగాల మండలం ఆకుపాముల, బరాఖత్‌గూడెం, నడిగూడెం మండలం సిరిపురం, నాగారం మండలం ఫణిగిరి, వర్ధమానుకోట, నేరేడుచర్ల మండలం దిర్శించర్ల, సోమారం, నూతనకల్ మండలం బిక్కుమళ్ల, మిర్యాల, సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామాల్లో మీసేవ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనే..

మీసేవ కేంద్రాలను ప్రైవేట్ స్థలాల్లో కాకుండా ప్రభుత్వ భవనాల్లో నిర్వహించాల్సి ఉంటుంది. 45 రోజులు శిక్షణ ఇచ్చి ప్రభుత్వం స్త్రీనిధి కింద రూ.2.50లక్షల రుణం ఇవ్వనుంది. ఈ రుణంతో మీసేవ కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన అన్ని పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం, నాగారం మండలం వర్ధమానుకోటల్లో రైతు వేదికలు, ఇక మిగతా అన్నిచోట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు గుర్తించారు.

అమాత్యా! నా మొర ఆలకించరూ!!



కోదాడ: గౌరవనీయులైన రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి వర్యులకు నా నమస్కారాలు. నేను పురుడు పోసుకొని పుష్కర కాలం దాటింది. మొట్ట మొదటిసారి నా సమస్యలు స్వయంగా తెలుసుకోవడానికి నేడు మీరు నా వద్దకు వస్తుండడం చాలా సంతోషంగా ఉంది. మీ రాకతోనైనా నా సమస్యలు తీరుతాయనే నమ్మకం కలుగుతోంది. పంచాయతీగా ఉన్న నేను పుష్కరకాలం క్రితం మున్సిపాలిటీగా మారాను. తెలంగాణ రాష్ట్ర ముఖద్వారంగా ఉన్న నేను ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు.

రూ.కోట్ల ఆదాయం ఉన్నా..

కోట్ల రూపాయల ఆదాయం ఉన్న దానిని సక్రమంగా వినియోగించేవారు కరువయ్యారు. అవగాహన లేని అధికారులు, పట్టింపులేని ప్రజాప్రతినిధులతో నేను మురికి కూపంగా తయారయ్యాను. నాకు ఉత్తరం వైపు సముద్రం వంటి పెద్దచెరువు, దక్షిణం వైపు నిండు కుండలా ఉన్న ఎర్రకుంటలు ఆక్రమణలతో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. పెద్దచెరువు ఆక్రమణలను నిరోధిస్తే పట్టణంలోని నా ప్రజలకు నీటి కరువు తీరుతుంది. కానీ దాన్ని పట్టించుకోకుండా ట్యాంక్‌బండ్ అభివృద్ధి పేరుతో ఇప్పటికే రూ.5కోట్లు ఖర్చు చేసి మరో రూ.6 కోట్లను ఖర్చు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇది చేయడం బాగానే ఉన్నా పట్టణానికి ఉత్తరం వైపు రామిరెడ్డి పాలెం నుంచి అనంతగిరి రోడ్డు వరకు చెరువు అంచున రోడ్డును ఏర్పాటు చేస్తే పెద్దచెరువు ఆక్రమణలు నిరోధించడంతో పాటు పట్టణ ప్రజలకు మరో రోడ్డు అందుబాటులోకి వస్తుంది. మీరు ఈ విషయంలో సీరియస్‌గా ఆలోచిస్తారని భావిస్తున్నాను.

పునాదులు దాటని ఇంటిగ్రేటెడ్ మార్కెట్

కోదాడ పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ ఇప్పటికీ అలాగే ఉంది. దాని స్థానంలో రూ.8 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పునాదులు దాటడం లేదు. మీరు దీనిపై కూడా దృష్టి సారించాలి. పట్టణంలో నాసిరకంగా వేసిన సీసీ రోడ్లు మట్టిరోడ్ల కన్నా అధ్వానంగా గుంతలను తలపిస్తూ నా బిడ్డల నడ్డి విరుస్తున్నాయి. హోదా పెరగడంతో మున్సిపాలిటీ అధికారుల్లో అలసత్వం పెరిగింది. అక్రమ లేఅవుట్లు, అస్తవ్యస్త నిర్మాణాలతో నేను కలతప్పి పోతున్నాను. బాధాకరమైన విషయం ఏమిటంటే ఇప్పటి వరకు నాకు మాస్టర్‌ప్లానే లేదు. నాకు రెండు వైపులా ఘనంగా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడానికి మీరు నిర్ణయించడం ఆనందం కలిగిస్తున్నా లోపల ఉన్న సమస్యలు పరిష్కరించక పోతే నా పరిస్థితి పైన పటారం.. లోన లొటారం అన్నట్లు ఉంటుంది.

సొంత భవనం కరువు

జిల్లాలోనే అధికాదాయం ఉన్న నాకు సొంత గూడు(కార్యాలయ భవనం) లేదు. కోట్ల రూపాయలతో కొత్త భవనం కట్టిస్తామని రెండేళ్లగా చెపుతున్నారే తప్పా ఒక్క అడుగు ముందుకు పడలేదు. నాకు ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరి కూలిపోతోంది. దాని స్థానంలో కొత్త కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని చెబుతున్నారు. కానీ ఎప్పుడు మొదలు పెడతారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇక పట్టణంలో దాహార్తిని తీర్చడానికి దాదాపు 10 వాటర్ ట్యాంక్‌లు అవసరం వాటి నిర్మాణం విషయంలో మీరు చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నాను.

అనంతగిరి రోడ్డు విస్తరణ ఏదీ?

పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే అనంతగిరి రోడ్డు విస్తరణకు నోచుకోక ఈరహదారిలో ప్రయాణించే రెండు మండలాల ప్రజలతో పాటు నయానగర్ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు విస్తరణ విషయంలో మీరు త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక పట్టణంలో ప్రధాన రోడ్డు విస్తరణ చేశారు. కానీ ఆక్రమణలు తొలగించలేదు. దీంతో ఉన్న ఒక రోడ్డు ఇరుకుగా మారింది. ఇలా చెప్పుకుంటూ పోతే నా సమస్యలు అనేకం ఉన్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరిస్తారని గంపెడు ఆశతో మీ రాక కోసం ఎదురు చూస్తుంటాను.

ఇట్లు
మీ.. కోదాడ పురపాలక సంఘం

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన , నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు. శ్రీఆంజనేయ స్వామికి తమలపాకులతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నూతనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

నూతనకల్: విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. మంగళవారం నూతనకల్‌లో పీహెచ్‌సీ, జెడ్పీహైస్కూల్ , అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం వివరాలు తెలుసుకున్నారు. జెడ్పీ హైస్కూల్‌లో దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందాయా అని అడిగారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు,తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పోర్టల్ సేవలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, డాక్టర్ అక్షితారెడ్డి, ఎంఈఓ రాములు నాయక్ పాల్గొన్నారు.

మహిళలు రాణించేలా కృషి చేయాలి

భానుపురి (సూర్యాపేట): మహిళలు అన్నిరంగాల్లో రాణించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహిళా శిశువికలాంగుల, వయోవృద్ధుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వెంకటరమణ, సీడీపీఓలు పారిజాత, కిరణ్మయి, శ్రీవాణి, రూప, హేమదేవి, శ్రీజ, డీసీపీఓ రవి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ వినోద్‌కుమార్, సఖి అడ్మిన్ హేమలత, చైతన్య పాల్గొన్నారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం సూర్యాపేటలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వివి అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జా దీపిక అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.ఈనెల 4తో జెడ్పీ పాలకవర్గం గడువు ముగియనుంది.

మరో మంత్రి పదవి!

- మంత్రివర్గ విస్తరణలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు దక్కే అవకాశం
- గతంలోనే హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం
- ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర
- ఉమ్మడి జిల్లా నుంచి మూడో మంత్రి పదవి ఖాయమంటున్న రాజకీయవర్గాలు



కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు మరో మంత్రి పదవి లభించే అవకాశం ఉంది. ఈ నెల 4వ తేదీన జరిగే మంత్రివర్గ విస్తరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి పదవి దక్కనుందని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవి ఆశిస్తున్నారు. పలు సందర్భాల్లో తన మనసులోని మాటను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాదు.. ఎంపీ ఎన్నికల్లో అన్ని బాధ్యతలు తానే తీసుకొని చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భువనగిరి ఎంపీగా గెలిపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేసిన రాజగోపాల్‌రెడ్డి.. రెండు రోజుల క్రితం డీసీసీబీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించి సీఎం రేవంత్‌రెడ్డి అభిమానాన్ని చూరగొన్నారు.

లైన్ క్లియర్ అయినట్లేనా..

ఎంపీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చేలా గతంలోనే అధిష్టానం హామీ ఇచ్చినట్లు తెలిసింది. అందుకే భువనగిరి ఎంపీగా తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిని పోటీ చేయించాలని చెప్పినా అందుకు ఆయన అంగీకరించలేదన్న చర్చ అప్పట్లో జరిగింది. పార్టీ సర్వేల ప్రకారం ఆమె పోటీలో ఉంటే భారీ మెజారిటీతో గెలుస్తారన్న చర్చ సాగడంతో అధిష్టానం లక్ష్మిని పోటీ చేయించాలని రాజగోపాల్‌రెడ్డిపై ఒత్తిడి పెంచినట్లు తెలిసింది. అయితే, అటు లక్ష్మిని ఎంపీగా పోటీలో నిలిపి, ఇటు మంత్రి పదవి అడిగితే పార్టీ పరంగా విమర్శలు వస్తాయనే భావనతో లక్ష్మిని పోటీచేయించేందుకు ఆయన ఒప్పుకోలేదు. అంతేకాదు తాము ఎంపీ టికెట్ అడుగడం లేదని, తమ కుటుంబ సభ్యులు ఎవరూ పోటీలో ఉండరని పలు సందర్భాల్లో ఆయన ప్రకటించారు. పార్టీ ఎవరిని బరిలో నిలిపినా భారీ మెజారిటీతో గెలిపించి తీసుకొస్తామని చెప్పుకొచ్చారు. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రతిపాదన మేరకు అధిష్టానం చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భువనగిరి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఆ ఎన్నికల్లో అన్నీ తానై వ్యవహరించి భారీ మెజారిటీతో గెలిపించుకోవడంలో సక్సెస్ అయ్యారు. దీంతో కేబినెట్ విస్తరణలో ఆయన పేరును ఖరారు చేసే అవకాశం ఉంది.

అమాత్య పదవి వస్తుందని ధీమాలో..

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తరువాత రాజకీయ సమీకరణల్లో భాగంగా రాజగోపాల్‌రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అధిష్టానం మంత్రి పదవిని కట్టబెట్టింది. తరువాత తనకు మంత్రి పదవి వస్తుందని అసెంబ్లీ సమావేశాల సందర్భంలోనూ రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే అదే సమయంలో పార్లమెంట్ ఎన్నికలు రావడంతో మంత్రివర్గ విస్తరణ వాయిదా పడింది. ఎన్నికల తరువాత విస్తరణ ఉంటుందని పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఈసారి తనకు కచ్చితంగా మంత్రి పదవి వస్తుందన్న ధీమాతో రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.

ముచ్చటగా మూడు..!

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వస్తే.. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు అవుతారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రిగా నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి అవకాశం కల్పించారు. ఇప్పుడు రాజగోపాల్‌రెడ్డికి కూడా మంత్రి పదవి వస్తే ఉమ్మడి జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కినట్లు అవుతుంది.

మంత్రి పదవిపై ముగ్గురి ఆశలు?

ఉమ్మడి జిల్లా నుంచి రాజగోపాల్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది. లంబాడా కోటాలో తనకు మంత్రి పదవి కావాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నట్లు సమాచారం. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా తన సతీమణి పద్మావతి రెడ్డికి మంత్రి పదవి అడుగుతున్నట్లు తెలిసింది. అయితే, అధిష్టానం ఇచ్చిన హామీ మేరకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కేబినెట్‌లో బెర్త్ దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి మూడో మంత్రి పదవిని కూడా రెడ్డి సామజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి ఎవరిని వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

‘రైతు భరోసా’కు కార్యాచరణ

- పీఏసీఎస్‌ల ద్వారా రైతుల అభిప్రాయాల సేకరణ
- రేపటి వరకు కొనసాగనున్న ప్రత్యేక సమావేశాలు
- తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్న అధికారులు



పీఏసీఎస్ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

హుజూర్‌నగర్ : రైతు భరోసా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. ఈ మేరకు రైతుల అభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత యాసంగి సీజన్‌కు సంబంధించి 10 ఎకరాలలోపు రైతులకు పెట్టుబడి సాయం అందించింది. ప్రస్తుత వానా కాలం పంటల సాగుకు పెట్టుబడి సాయం ఎవరికి ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి, ఎంత ఇవ్వాలని రైతుల ద్వారానే అభిప్రాయాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం పీఏసీఎస్‌ల ద్వారా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోంది.

4వ తేదీ వరకు ప్రత్యేక సమావేశాలు ..

రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణకు జిల్లా సహకార శాఖ ద్వారా సంఘాల పరిధిలో జూన్ 29 నుంచి అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి ఈనెల 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో రైతుల అభిప్రాయాలను మౌఖికంగా తెలుసుకుంటున్నారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో తీర్మానం చేసి నివేదికను జిల్లా సహకార శాఖకు పంపనున్నారు. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు.

ఐదు క్లస్టర్ల పరిధిలో 47 పీఏసీఎస్‌లు..

జిల్లా వ్యాప్తంగా 5 సహకార శాఖ క్లస్టర్ల పరిధిలో 47 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) ఉన్నాయి. సమావేశాల నిర్వహణలో జిల్లా వ్యవసాయ అధికారితోపాటు సహకార శాఖ అధికారులను భాగస్వాములను చేశారు. వీటికి ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఆయా సంఘాల పాలకవర్గాలు, సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి ద్వారా రైతు భరోసా విధివిధానాలపై అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. ఎక్కువగా రైతులు సాగు భూములకే పెట్టుబడి సాయం అందించాలని, ఎంత భూమి ఉన్నా ఇవ్వాలని కొందరు చెబుతుండగా, పది ఎకరాల వరకే పెట్టుబడి సాయం ఇవ్వాలని ఇంకొందరు చెబుతున్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింప జేయాలని కోరుతున్నారు. వ్యవసాయేతర, రియల్ ఎస్టేట్ భూములను దీని నుంచి మినహాయించాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం



ప్రస్తుతం ఉన్న రైతు బంధు పథకం అమలుపై రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నాం. దీనికోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నాం. అన్నదాతల అవసరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను ప్రభుత్వాని పంపిస్తాం. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

–ఎస్ పద్మ, జిల్లా సహకార అధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

కుక్కల దాడిలో యువకుడికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడ్డ మహేష్

గుండాల: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన బత్తిని మహేష్‌పై మంగళవారం కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలపాలైన యువకుడు గ్రామంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు. గ్రామాలల్లో ప్రజలపై దాడి చేస్తున్న కుక్కలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని కొత్త గుండ్లపల్లి సమీపంలో గల సన్నిధి హోటల్ దగ్గర ఆటోలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం ఎస్‌ఐ ఉదయ్ అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సన్నిధి హోటల్ సమీపంలో భువనగిరి నుంచి యాదగిరిగుట్ట వైపు వస్తున్న వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా.. ఓ ఆటోలో 35 గ్రాముల గంజాయిని తరలిస్తున్న సిద్దులు, నరేష్ అనే వ్యక్తులను ఎస్‌ఐ ఉదయ్ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

భువనగిరి క్రైం: పట్టణంలోని గ్లాస్ కంపెనీ వద్ద గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న కొత్త శేఖర్ వద్ద సుమారు రూ.8000 విలువ గల 1600 గుట్కా ప్యాకెట్లను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూతన చట్టాల ప్రకారం శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

చింతపల్లి: హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి గుండా నెల రోజులుగా వందల సంఖ్యలో నల్లమట్టిని రవాణా చేస్తున్న టిప్పర్లను మంగళవారం మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. గుర్రంపోడు, దేవరకొండ మండల కేంద్రాల నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇటుక బట్టిలకు గత నెల రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా రాత్రి పగలు నల్లమట్టిని వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా అధిక లోడు, అతివేగంతో తరలిస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలం కావడంతో పరిమితికి మించిన నల్లమట్టిని తరలిస్తుండడంతో టిప్పర్ల నుంచి మట్టి రోడ్డుపై పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో టిప్పర్లను అడ్డుకున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామస్తుకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమనిగింది. సుమారు 3 గంటల పాటు 200 టిప్పర్లు జాతీయ రహదారిపై నిలిచిపోయాయి.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

- నల్లగొండ జిల్లా వైద్యాధికారి కళ్యాణ్‌చక్రవర్తి

సాక్షి ఎఫెక్ట్..

శాలిగౌరారం: ప్రభుత్వ వైద్య సిబ్బంది విధుల పట్ల అలసత్వంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. మంగళవారం 'సాక్షి' దిన పత్రికలో 'వైద్యం కోసం వృద్ధుడి పడిగాపులు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జిల్లా వైద్యాధికారి స్పందించారు. ఈ నేపథ్యంలో శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు మందుల స్టాక్ రిజిస్టర్, ఓపీ నమోదు రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బంది పని తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిలో కొందరు గ్రూపులను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత సిబ్బందిపై ఇప్పటికే నివేదికలు అందుతున్నాయని, పూర్తిస్థాయిలో నివేదికలు అందగానే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. విధి నిర్వహణలో సమష్టిగా పనిచేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే పనిచేయాలే తప్ప ఇష్టానుసారం వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా డ్యూటీ చార్ట్‌ను తయారుచేయాలని మండల వైద్యాధికారిని ఆదేశించారు. దీంతో మండల వైద్యాధికారి విధుల షెడ్యూల్ చార్ట్‌ను తయారుచేసి ఆయన ముందు పెట్టడంతో డ్యూటీ చార్ట్ ప్రకారం రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి సూర్యశిల్ప, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.



శాలిగౌరారం పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న నల్లగొండ జిల్లా వైద్యాధికారి కళ్యాణ్‌చక్రవర్తి

ఎంపీ ఆరా..

ఈ ఘటనపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఆరా తీశారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలకు హాజరైన ఎంపీ స్థానికులు వాట్సాప్‌లో ఆయనకు పంపిన సాక్షి దినపత్రిక కథనానికి స్పందించారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులతో పాటు మండల వైద్యాధికారికి ఫోన్‌చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో వైద్య సిబ్బంది అవలంబిస్తున్న నిర్లక్ష్యధోరణిపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీకి వచ్చే సిబ్బంది ఆలస్యంగా విధులకు హాజరు కావడంతో ఇలా జరిగిందని, మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు చేపడతామని మండల వైద్యాధికారి సూర్యశిల్ప ఎంపీకి వివరించారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత



కుంచం శివకు ఆర్థిక సాయం అందజేస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



శివకు ఆర్థికసాయం అందజేసిన కర్నాటి విజయ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కుంచం శివ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జనరల్ కేటగిరీలో ఆలిండియా 211వ ర్యాంక్, బీసీ కేటగిరిలో 24వ ర్యాంక్ సాధించి ఐఐటీ బాంబేలో సీటు సంపాదించాడు. తల్లిదండ్రులు లేని శివను ఆర్థికంగా ఆదుకోవాలని మంగళవారం సాక్షి దినపత్రికలో 'సరస్వతీ పుత్రుడికి సాయం చేయరూ' అని ప్రచురించిన కథనానికి పలువురు దాతలు స్పందించారు. నల్లగొండ జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివను ఘనంగా సన్మానించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో తడకమళ్ల పీఏసీఎస్ చైర్మన్ పాదూరి సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ దుండిగల యాదమ్మశ్రీనివాస్, గార్లపాటి సతీష్‌రెడ్డి, నాగేందర్, ఆంజనేయులు, అంజయ్య, రవి, ఎల్ల య్య, గోపి, శేఖర్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, నాగేందర్‌బాబు, ఉపేందర్, అశోక్, హనుమంతు, సత్యం, వెంకన్న, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోదాడ మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఏసురెడ్డి అజిత సౌదీ అరేబియాలో ఉంటున్న తన భర్త మల్లు ఏసురెడ్డికి సాక్షి కథనాన్ని పంపించగా అతడు శివకు ఫోన్ పే ద్వారా రూ.10వేల ఆర్థిక సాయాన్ని పంపించారు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో వలంటరీ రిటైర్డ్ ఏటీఓ, జనగణమన ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్ ముందుకు వచ్చి శివకు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దోసపాటి శ్రీనివాస్, ఆదిత్య హైస్కూల్ ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి, అలుగుబెల్లి శ్యామ్ సుందర్‌రెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా

డిండి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న కరుణాకర్ అక్రమాలకు పాల్పడుతున్నాడని, అతడిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట పలు విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు మధ్య మనస్పర్థలు రావడంతో గ్రూపులుగా ఏర్పడి బోధన విషయంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులు పనితీరుపై విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను సాక్షి వివరణ కోరగా తనపై విద్యార్థి సంఘాల నాయకులు చేస్తున్న ఆరోపణలు మాత్రమేనని, అందులో వాస్తవం లేదని, కావాలనే కొంత మంది కక్ష్య సాధింపుగా చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నిరసన తెలిపిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఆ సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు ప్రేమ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వినయ్, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి వెంకటేష్, బీఆర్‌ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, బాను, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వృద్ధురాలి మృతి.. కేసు నమోదు

మోత్కూరు: మున్సిపల్ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద కూరగాయల మార్కెట్‌లో సోమవారం కుళ్లిపోయిన స్థితిలో ముద్రబోయిన సత్తమ్మ(65) అనే వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. మృతురాలి చిన్న కోడలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు మంగళవారం ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

భువనగిరి క్రైం: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన సుధీర్‌కుమార్ తన బైక్‌ను జూన్ 30వ తేదీ రాత్రి తన ఇంటి ముందు పార్కింగ్ చేయగా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఎంత వెతికినా బైక్ దొరక్కపోవడంతో మంగళవారం భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ కె. వీరస్వామి తెలిపారు.

నేడు జాబ్‌మేళా

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ (కేపీఎం) ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ (బ్రిడ్జి కోర్సు)లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులైని పేర్కొన్నారు. పదో తరగతిలో 60 శాతం, ఇంటర్‌లో 55 శాతం మార్కులతో 2023–24 సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే వారి అర్హత సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్‌ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో టెక్నికల్ ట్రైనీ పోస్టుల్లో నియమించడం ద్వారా ఉపాధి కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 6303204925, 9182063878 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

- నూతన క్రిమినల్ చట్టం ప్రకారం కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం తిప్పర్తి మండలంలో పోలీసులు పట్టుకుని నూతన క్రిమినల్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లికి చెందిన జాటంగి సైదులు తిప్పర్తి మండలం మామిడాల గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సేకరించిన 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తన ఆటోలో తరలిస్తుండగా.. మామిడాల గ్రామ పంచాయతీ స్టేజీ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూతన క్రిమినల్ చట్టం ప్రకారం అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ డి. రాజు తెలిపారు.

మిర్యాలగూడలో 30 క్వింటాళ్లు..

మిర్యాలగూడ టౌన్: పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడ్స్ క్యారియర్ వాహనంలో 30 క్వింటాళ్ల(60 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామం నుంచి అద్దంకి–నార్కట్‌పల్లి మెయిన్ రోడ్డుకు వెళ్లే దారిలో పెట్రోలింగ్ పోలీసులు వాహనాన్ని పట్టుకుని తనిఖీ చేశారు. ఇది గమనించిన డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

రామన్నపేట: రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని బీజేపీ దళితమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించి, ఖాళీగాఉన్న పోస్టులను భర్తీ చేయాలని మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, జంగిలి కోటిలింగం, అక్కెనపల్లి సైదులు, జంగిలి సత్యనారాయణ, మిర్యాల రాజ్‌కుమార్, కంబాలపల్లి సైదులు, బొడిగె సురేష్, చెరుకు గణేష్, శ్రీకాంత్‌చారి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

ప్రభుత్వ భూమి కబ్జా

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

గుండాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని కొందరు రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయం వెనుక సర్వే నెంబర్ 903, 904లో సుమారు 38.36 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమి పక్కనే కొంతమంది రియల్ వ్యాపారులు ఇటీవల పట్టా భూములను కొనుగోలు చేశారని, పట్టా భూమితో పాటు 3ఎకరాల ప్రభుత్వ భూమిని కలుపుకొని హద్దురాళ్లు నాటుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంతమంది మండల నాయకులతో రియల్టర్లు చేతులు కలిపి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై తహసీల్దార్ జలకుమారిని వివరణ కోరగా.. మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూములకు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కడీలు నాటిన రియల్టర్లు

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

కోదాడరూరల్ : దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని ఐవీఏ ఫౌండేషన్ నిర్వాహకులు అన్నారు. మంగళవారం కార్గిల్ యుద్ధవీరుడు గోపయ్యచారి 25వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైనికుల జీవితాల త్యాగాల ఫలితంగానే ప్రజలు సంతోషంగా ఉంటున్నారని అన్నారు. యువత సైనికులను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐవీఏ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌చౌదరి తదితరులు ఉన్నారు.



గోపయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐవీఏ ఫౌండేషన్ నిర్వాహకులు

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

- కోదాడ–జడ్చర్ల హైవేపై కొండమల్లేపల్లి మండల కేంద్రంలో తరచూ ప్రమాదాలు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల మీదుగా వెళ్లే జాతీయ రహదారి 167 ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ జాతీయ రహదారి కోదాడ నుంచి జడ్చర్ల వరకు సుమారు 200 కి.మీ. మేర ఉంటుంది. కొండమల్లేపల్లి పట్టణం ఇటు హైదరాబాద్ అటు కోదాడ మరియు నాగార్జునసాగర్‌కు కేంద్ర బిందువుగా ఉండడంతో ఈ రహదారి గుండా నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది.హీ హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు, బాటసారులు సైతం మృత్యువాతపడుతున్నారు. ఈ జాతీయ రహదారిపై సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక పోలీసులు ఈ జాతీయ రహదారిపై కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ఐదు బ్లాక్ స్పాట్లను గుర్తించారు. చెన్నారం, జోగ్యతండా, ఆర్టీసీ బస్టాండ్, పట్టణ చౌరస్తా, పెండ్లిపాకల ఎక్స్ రోడ్డుతో పాటు కొల్‌ముంతలపహాడ్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేస్తే కొంతవరకైనా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాత్రివేళ సాగర్ రోడ్డులో హైవే పక్కన భోజనాల కోసం వాహనాలు నిలిపి రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. రాత్రి వేళ జాతీయ రహదారి డివైడర్లపై ఉన్న విద్యుత్ దీపాలు కూడా వెలగడకపోవడం కూడా ప్రమాదాలకు ఒక కారమణని చెప్పవచ్చు. 2023 జనవరి నుంచి 2024 జూన్ సుమారు 16 మంది ఈ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కొండమల్లేపల్లిలో హోటల్ ఎదుట కోదాడ - జడ్చర్ల హైవేపై నిలిపిన వాహనాలు



బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన పెండ్లిపాకల ఎక్స్ రోడ్డు

వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలి

ముఖ్యంగా పెండ్లిపాకల ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగే ప్రదేశంలో వేగ నియంత్రణ బోర్డులతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఎస్. శ్రీనివాస్, డీసీఎం డ్రైవర్, కొండమల్లేపల్లి

దాతల సహకారంతో సూచిక బోర్డులు

జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై మూల మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటాం. దాతల సహకారంతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం.

– రామ్మూర్తి, ఎస్‌ఐ, కొండమల్లేపల్లి

డీసీఎంను ఢీకొట్టిన లారీ.. ఐదు గేదెలు మృతి

మద్దిరాల: డీసీఎంను లారీ ఢీకొట్టడంతో ఐదు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల గ్రామ స్టేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి పశువుల వ్యాపారులు ఎండీ జమ్మర్, ఎండీ అఖీమ్, ఎండీ యాదుల్ గేదెలను డీసీఎంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలో మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామ శివారులో 365వ నంబర్ జాతీయ రహదారి పక్కన డీసీఎంను డ్రైవర్ పక్కకు ఆపి మూత్రవిసర్జన చేస్తుండగా.. వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో డీసీఎంలోని ఐదు గేదెలు ఊపిరాడక మృతిచెందాయి. సమాచారం తెలుసుకున్న వెటర్నరీ జిల్లా అధికారులు కుమారస్వామి, ఏడీ వెంకన్న, రవిప్రసాద్, రవికుమార్, ఆసిఫా మృతిచెందిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పశువులను తరలిస్తున్న వ్యక్తులతో పాటు లారీని అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ కొండ వినయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. మిగిలిన గేదెలను గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.



మృతి చెందిన గేదెలు

నారుమడిలో సరైన జాగ్రత్తలు పాటించాలి

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో రైతులు వరి నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. ఓ వైపు దుక్కులు దున్నుకుంటూ, మరోవైపు నారుమడులు పోసుకుంటూ ఉన్నారు. సరైన జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన నారు సిద్ధమవుతుందని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు చెబుతున్నారు. నారుమడి తయారీలో సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

- నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేయాలి.



నారుమడి

- 5 సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లేముందు, మరో కిలో విత్తిన 12–14 రోజులకు) కిలో భాస్వరం మరియు కిలో పొటాషినిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి.
- మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత పలుచగా నీరు కట్టాలి.
- జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి. చలి ఎక్కువగా ఉండే దాళ్వా వరి సాగులో జింకు లోపాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

శ్రీ వరి నారుమడి యాజమాన్యం

శ్రీ వరి నారును 8 నుంచి 12 రోజుల దశలో నాటాలి కాబట్టి నారు పెంచడంలో మెళకువలు పాటించాలి. 2 కిలోల విత్తనాన్ని ఒక సెంటు భూమిలో చల్లి నారు పెంచితే ఎకరాకు సరిపోతుంది. భూమిని మెత్తగా దున్ని, దమ్ము చేసి, ఎత్తుగా తయారు చేసి, చుట్టూ కాలువ తీయాలి. తడిమట్టి జారిపోకుండా నారు చుట్టూ చెక్కతోగాని బొంగులతో గాని ఊతం ఏర్పాటు చేయాలి. నారుమడి తయారైన తర్వాత చివికిన మెత్తటి పశువుల ఎరువును ఒక పొరలాగా చల్లి, దానిమీద 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండె కట్టిన, మొలకెత్తిన విత్తనాన్ని పలుచగా చల్లాలి. విత్తనాల పైన మరలా మరోపొర పశువుల ఎరువు చల్లి గడ్డితో కప్పాలి. మొలకెత్తిన విత్తనాన్ని పలుచగా చల్లాలి. విత్తనాలపైన మరలా మరోపొర పశువుల ఎరువు చల్లి, గడ్డితో కప్పాలి. మొలక వచ్చిన వెంటనే గడ్డిని తీసివేయాలి. రోజూ నీరు చల్లుతూ ఉంటే 8 రోజులలో వరి నారు 2–3 ఆకులతో ధృడంగా పెరుగుతుంది. నారుమడి నుంచి నారు పీకకుండా, మట్టితో సహా పొలంలోకి తీసుకెళ్లి గింజ, బురదతో సహా వరుసకు వరుసకు 25 సెం.మీ., మొక్కకు మొక్కకు 25 సెం.మీ. ఎడంగా ముందుగా మార్కర్ సహాయంతో గీతలు గీసుకొని గీతలు కలిసే ప్రాంతంలో ఒక్కొక్క మొక్కను పైపైన నాటాలి.

- విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు మరియు 17 రోజులకు పిచికారీ చేయాలి. లేదా నారు తీయడానికి 7 రోజులకు ముందు సెంటు నారుమడికి 160 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకలో పలుచగా నీరుంచి వేయాలి.